# శ్రీమృత్యుంజయ శతకము

## అన్నె వెంకటార్య విరచితము

సుఖవ్రతము శ్రీ అన్నె రామకృష్ణమ్మగారి కుమారుడు
శ్రీ వెంకటరత్నంగారి ద్రవ్యసహాయమున
ము ద్రి త ము
1943

13711

శ్రీ ............................................................. గారికి

శ్రీ అన్నె పద్మనాభుడుగారి బహూకృతి

# అధికారపత్రిక

మా పితామహులగు అన్నె వెంకయార్యునిచే రచింపబడిన "శ్రీ మృత్యుంజయ శతకమును" నా అనుమతిపొంది 2958 శ్రీ ఉప్పలూరు సహకార పరపతి సంఘమువారు అచ్చొత్తించి యున్నారు. దాని ముఖ పత్రమును తమ పేరుతో ప్రకటించుకొనుటకు శ్రీ ఉప్ప లూరు కాపురస్థులు శ్రీ అన్నె రామకృష్ణమ్మగారి కుమారుడు శ్రీ అన్నె వెంకటరత్నంగారికి నేను నేడను మతి నిచ్చుచున్నాను. ఈ గ్రంథముయొక్క సర్వస్వామ్య ములు నాయందే యుంచుకొనుచున్నాను.

ఉప్పలూరు
బెజవాడ తాలూకా,
కృష్ణాజిల్లా
19—9—1943.

ఇట్లు,
అన్నె పద్మనాభుడు వ్రాలు,
గ్రంథకర్త మనుమడు,
గ్రామమునసబు, ఉప్పలూరు.

# శ్రీ మృత్యుంజయ శతకము

అన్నె వెంకయార్యునిచే

రచియింపబడి

ఉప్పలూరు సహకారపరపతి సంఘమువారిచే

ప్రచురింపబడి

1371

బెజవాడ ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాలయందు

ముద్రింపబడినది.

1937

# ఉపోద్ఘాతము

ఈ 'మృత్యుంజయశతక' కర్త అన్నె వెంకయార్యుడు. ఈ కవి ఇప్పటికి 72 సం॥ల క్రిందట నీగ్రంథమును రచించెను. కవియే 'సరిగా జెప్పితి శాలివాహశకవర్షప్రాప్తవద్బాణకుంజర గోత్రాంబుజవైరి....' అను పద్యములో శా. శ. 1785 దుందుభివత్సర మాఘమాసమున తా నీశతకమును రచించినట్లు చెప్పుకొనియున్నాడు. గ్రంథరచనా కాలమునకు కవికి సుమారు 50 సం॥ లుండెనని 'గతవర్షమ్ముల నెన్న నర్ధశతమా కావచ్చె...' అన్నపద్యమువలన తెలియుచున్నది. ఈకవి నివాసము బెజవాడతాలూకాలోని ఉప్పులూరు గ్రామము. వీరు సుప్రసిద్ధకమ్మకులజులు. తాడిపాల గోత్రజులు. వీరితండ్రి పద్మనాభుడు, తల్లి మీనాక్షమ్మ, భార్య దేవాక్షమ్మ. వీరికి ముగ్గురుకుమారులును ముగ్గురుకుమార్తెలును కల్గిరి.

వీరు ఉప్పులూరు గ్రామమున్సిఫ్‌గా పేరు ప్రఖ్యాతులు కాంచిరి. సంపన్నులగు రైతులు, సత్యవాక్యధురీణులు మిక్కిలి సుకుమారులు. దైవభక్తి వీరికి వెన్నతో బెట్టినది. ఇది వీరి పూర్వులనుండి వంశపారంపర్యముగా లభించిన వారసత్వపు హక్కు. శాఖోపశాఖలుగా చీలిన అన్నెవంశవృక్షమున ఆస్తి చీలికలైపోయినను, అభిన్నమై అద్వితీయమై తేజోవంతమై నేటికిని మధురరసములతో నిండి చవులూరించు భక్తి ఫలము మాత్రము సర్వజనాకర్షకముగ వెలయుచుండుట యీ వంశము యొక్క విశిష్టలక్షణము. అది వారి అమృతభాగధేయము. ఆఅమృత ఫలములోని ఆనందసారమే యీ చిన్ని గ్రంథము.

ఇప్పటికి 72 సం॥ల క్రితము తాళపత్రస్థమైయుండి క్రమముగా క్రిమిదష్టమై శిథిలావస్థనొందియున్న తరుణమున, గ్రంథకర్త వంశీ

యులు విశేషప్రయాసకు లోనయి కొలది తప్పులతో గ్రంథమును తిరుగవ్రాసి, యచ్చొత్తింప సంకల్పింప నుండుతఱి నేను దైవవశమున ఉప్పులూరుకు నా ప్రియమిత్రులగు బ్రహ్మశ్రీ ఉప్పులూరి శ్యామలరావు గ్రామకరణము గారిని దర్శించుటకు వెళ్ళితిని. అప్పుడు వారు సన్ని గ్రంథమును సవరించి యుపోద్ఘాతమును వ్రాయుమని కోరిరి. భక్తుల గ్రంథములకు జేయు సేవయు పరమార్థమున పరమేశ్వర సేవయే కదా! ఈ సదవకాశమును కల్పించిన శ్రీ
శ్రీ అన్నె వంశీయులకును సర్వదా కృతజ్ఞుడను.

## గ్రంథ విమర్శ

ఇక గ్రంథమును పరామర్శించి యందలి విశేషములను పాఠక లోకమున కందీయవలసియున్నది. కవితకు ప్రాణము శక్తి. ఇది రసతన్మయతచే సిద్ధించును. భావానుభవము రసతన్మయతకు సోపానము. భావములకు శీలము వేవిలి మక్కి. శీలమునకు వంశము, పరివృథము పాలి కాపులు.

ఈనికషోపలముచే నొఱపిడి పెట్టి పరిశీలింప గ్రంథమున శక్తిచెలమ లూరుచున్నవి. ఐహికలాంపట్య పిపాసువులుదాహము తీర్చుకొని ఆనంద శీతలచ్ఛాయల మై మరువగలరు. ప్రతిపద్యము భక్తినిబిడమై రసావేశము కల్గింపజాలియున్నది శైలి ధారాళమై సరసపద గుంఫితమై కదలీపాకమున కవియొక్క వాగ్వశీకరణతకు ముకురమై రసజ్ఞులనలంకరించుచున్నదనిన మకరందమున మాధుర్యము కలదనుటయే. ఈ కలకండపలుకులనురుచిచూడుడు:—

మ॥ కనదుత్తుంగ విభాసమానమగు నీ ♦ కైవల్య సింహాసనం
బున కశ్రాంతము మేలుకావలె దయాం♦భోధీ! యుహానాధ!మీా

ఘనభక్తావన తత్పరత్వమునకుఁ ♦ కళ్యాణముల్ కావలెఁ
వనజాతప్రభవాండకుంభ ! నటనా♦వష్టంభ! మృత్యుంజయా.

మ. తలపై క్రొన్నెలసిరివెన్నెలలు గా ♦ త్రింబందు కాకోలమం
డలి పెంజీకటు లొక్కటఁ తెలుపు నా ♦ త్మజ్ఞానముఁ భోజనం
బులకుఁ భోగములెల్ల మిథ్యలని యు ♦ ద్బోధించుగో దైత్యని
ర్దళనారంభవిజృంభమాణ! నతభ♦క్తత్రాణ! మృత్యుంజయా.

మ॥ కమలాధీశు మృదంగవాద్యము దివౌ♦కజ్యేష్ఠు తాళంబు నా
దమునఁ మించగ శారదాతరుణి గీ♦తంబుల్ చెలంగంగ న
య్యమరుల్ సిద్ధులుసంయమీంద్రులుగణా♦ధ్యక్షుల్ భజింపఁ ప్రదో
షమునఁ నాట్యముసల్పుమూర్తి మదిసం♦స్థాపింతుమృత్యుంజయా.

సరు కంతయు కుడియెడమగా నిట్టిదే. ఎంత యనుభవించినను కసరులేదు; మొగము మొత్తదు. కాని యొకచిత్రము. ఎక్కడికక్కడే యంతర్ముఖత్వము. స్వస్వరూపానుసంధానము. అద్వైతసిద్ధి. అమృత యోగము. ఆనందభోగము. ఇది యీ జపమాలలోని రహస్యమహిమ.

ఈ పూలపూజకు మృత్యుంజయుడు అధిష్ఠానదైవము. హృదయము పీఠము. కవిత నీరాజనము. భక్తి మహానైవేద్యము. నివేదితాంధస్సు ఆంధ్రభూమి కప్పనము.

అన్నదాతా! వేంకయకవీ! ధన్యుడవు. అన్నవంశమా! ధన్యతమవు! మీనామములు ప్రాతఃస్మరణీయములు. మీకీర్తి చిరస్థాయి! మీలక్ష్యము జగద్వంద్యము!

ఈ కవిరత్నమును గన్న పవిత్రమగు అన్నవంశము యొక్క చరిత్ర యొక్కింత సమీక్షసేయుట అప్రస్తుతము కాజాలదుకదా!

# అన్నె వంశ చరిత్ర

ప్రకృతము ఏతద్వంశీయులకు తెలిసినంతవరకు యీ వంశమునకు మూలపురుషుడు దేవప్ప. ఈయన సుమారు 200 సం|| లకు పూర్వము వేంకటగిరి సీమనుండి ఉప్పులూరుకు వలసవచ్చినాడు. ఈయన మిక్కిలి ధార్మికుడు. దయాహృదయుడు. తన ప్రజ్ఞావిశేషముచే పుష్కలముగ భూమి సంపాదించి సేద్యముచేయుచు తానుభవించి యొకరికిపెట్టి ధన్యుడై గ్రామమధ్యమున నొక బావిని త్రవ్వించి నాడు గ్రామస్థులకుగల నీటియిబ్బందిని తొలగించినాడు. నేటికిని ఆ బావి 'దేవప్పబావి' యను సంజ్ఞతో మిక్కిలి యుపయోగకరమై శ్రీ దేవప్పగారి అమృత జీవనమునకు తార్కాణమైయున్నది. ఈయన సుమారు 90 సం||లు జీవించి పరమపదించినాడు.

శా. శ్రీవిఖ్యాతి దనర్చు కమ్మకులని ♦ స్సీమప్రభావాబ్ధి 'అ
న్నె'వంశంబున కాదిపూరుషుడుగా♦నిర్ణిద్రకీర్తిప్రభా
ధావళ్యంబుల మించి ధర్మరచనా♦ధౌరేయుడై యొప్పు నా
దేవప్పన్ నుతియింప నొప్పదె! కృపా♦దివ్యత్వజీవాప్పతిన్.

ఉ. జీవనదాతృతాఘనత ♦ జీవనుజీవనజీవకంబుగా
కోవిదవృత్తవిస్ఫుటత ♦ కూపప్రతిష్ఠ నొనర్చి యుప్పులూర్
జీవిక కుగ్గుబాలిడి వి♦శిష్టతఁ గూర్చినపుణ్యశాలి యా
దేవప; దేవపత్వమున ♦ దేవపదంబనదే! వసింపఁగన్.

వీరి కుమారులు పద్మనాభుడు, సూరన్న యను నిర్వురు పుణ్యమూర్తులు. ఇందు పద్మనాభుడు ఉప్పులూరునందు గల శ్రీ భోగమల్లేశ్వరాలయమును కట్టించి తనయపారదైవభక్తిని మూర్తీభవింప జేసినాడు. భూతదయకు కాణాచియగు వీరి హృదయ మంతతో తృప్తి నొందలేదు. ప్రస్తుతము రోడ్డుకు తూర్పువైపున 'క్రొత్తయూరు' గల ప్రదేశమున విశాలమగు నారామప్రతిష్ఠ గావించినాడు. ఈప్రతిష్ఠాపన ద్వయమును వారిపేరు నాచంద్రార్కము నిల్పుటకు చాలియున్నవి. వీరు నిత్యమును ఉప్పులూరుకు 6 మైళ్ల దూరమున గల కృష్ణానదికి బోయి యందు కృతావగాహులై తిరిగి వచ్చువారట! ఆహా! ఏమి వీరి పరాకాష్ఠ! ఏమి వీరి ఆస్తికబుద్ధి! శాస్త్రవిశ్వాసము! వీరి యీ

వర్తనమునకు వీరి విద్యావిశారదత్వము దోహదమొసంగినది. జ్యోతిష శాస్త్రమున వీరికి గల పాండిత్యము అపారము. ఆశ్చర్యకరము. ఒకప్పుడు వీరు కృష్ణానదినుండి యింటికివచ్చు మార్గమున ఈదుప్ప గొలను అను గ్రామమున ఒకచో ఇంటికై ప్రతిష్ఠించబడిన స్తంభమునుచూచి నిదానించి అచ్చటివారితో 'ఆ స్తంభము అగ్ని ముహూర్తమున ప్రతిష్ఠింపబడెననియు అట్లగుట ఇంటికినాశముకలుగు ననియు చెప్పి దానికి నిదర్శనముగా ఒక చొప్పకట్టను ఆ స్తంభముపై నుంచినచో 10 దినములలో అది దగ్ధమగు'ననియు చెప్పి వెడలిపోయె నట! ఈ విచిత్రమును చూచుటకై ఆ గ్రామస్థులు ఒక చొప్పకట్ట నా స్తంభముపై పెట్టియుంచగా వారము దినములకు అది ఒకనాడు నిర్హేతుకముగ తగులబడుటను కన్నారచూచి పద్మనాభుడుగారి అసాధారణపాండిత్యమునకు రిచ్చవడి వెంటనే ఆవార్త వారికెఱింగించి వారిచే వేఱొక సుముహూర్తమును పెట్టించుకొని గృహమును నిర్మించుకొని సుఖముగా నుండిరట!

వీరి సాహిత్యజ్ఞానము అసాధారణము. వీరు నిరతము గ్రంథ కాలక్షేపము సేయుచు ప్రశాంతముగ జీవితమును గడపిరి. వీరి వార్ధక్యమున వీరికి కుష్ఠువ్యాధి కలుగగా గోదావరీతీరమునకు బోయి అచ్చట మంత్రతీర్థముచే ఒక సంవత్సరములో నారోగ్యవంతులై తిరిగి యింటికి వచ్చిరి. వీరు 70 సం॥లు జీవించిరి. జీవిత పరమార్థమును గ్రహించి చరితార్థులైన భక్తకోటిలో వీరి నామము స్థిరమై యుండుటలో వింతయేమి?

సూరన్న:--- ఈయన దేవప్ప ద్వితీయ పుత్రరత్నము. ఈయన అన్నివిధముల సోదరుని కుద్దియై ప్రఖ్యాతి నొందెను. ఉప్పులూరున శ్రీ వేణుగోపాల స్వామివారి ఆలయ ప్రతిష్టను, రోడ్డుకు పడమర వైపున ఆరామప్రతిష్టను చేసినాడు. ఈయన గొప్ప రాచకీయవేత్త. నాడు జుజ్జూరు సంస్థానమున ముఖ్యుడై పరిగణా పెత్తనదారుడుగా నుండెను. తన సహజౌదార్యమునకు ఫలముగా నీయన అనేకభూములను బీదలకు యీనాములుగా నిచ్చినాడు. వీరి సోదరు లిరువురకును జుజ్జూరు సంస్థానమువారు 'చౌదరి యీనాం' అనుపేరుతో నొక

యిచ్చినారు. ఈయన 70 సం॥లు జీవించి భక్తుడై, కృపాళుడై, వ్యవహార్తయై, దీనజనమందారమై మంచి పేరుపొంది స్వర్గమలంకరించి నాడు. పద్మనాభుని కుమారులు ముగ్గురు(1) కిష్టమ్మ (2)మృత్యుంజయుడు (3) మూర్తన్న.

ఇందు మృత్యుంజయుని ధర్మపత్ని వరాల పార్వతమ్మ. వరహాలతో అత్తింటికి వచ్చుటచే ఆమెకీ బిరుదనామము కల్గినదట. ఈయమ పరమపతివ్రిత, భక్తురాలు. ఇప్పుడు గ్రామమునకు తూర్పున గల 'పార్వతమ్మబావి' యీమె త్రవ్వించినదే. మామగారు కట్టించిన శ్రీ భోగమల్లేశ్వరాలయము చికిత్సనొందగా యీమె దాని నుద్ధరించి తన దైవభక్తిని పెద్దలయెడ గౌరవవిశ్వాసములను వెలయించినది.

కిష్టమ్మ కుమారులు వీరమల్లన్న, వియ్యన్న అను వారలు. వీరిలో వీరమల్లన్న వ్యవహారదక్షుడై జుజ్జూరు సంస్థానములో మంచి పలుకుబడికలిగి రాజసత్కారములొంది కీర్తిగడించినాడు.

మృత్యుంజయునికి కుమారులార్గురు (1) అంబారాయుడు (2) వీరన్న (3) కిష్టమ్మ (4) భోగన్న (5) శ్రీశైలం (6) పద్మనాభుడు. వీరిలో వీరన్న పండితుడుగా ప్రఖ్యాతి నొందెను. సమస్త సద్గుణసంపన్నుడు. బ్రహ్మవిద్యాపారంగతుడు. అపరంజిమై ఛాయ నిగనిగలతో అత్యంత సుకుమారుడై యీశ్వర సేవాపరుడై, నిరశనవ్రతుడై పరాకాష్టమై ఆత్మోపలబ్ధిని చూరగొనిన సిద్ధయోగి. ఈ మహాపురుషుని గుణించియే యీ గ్రంథకర్త 'మా పూర్వుల్ చిరకీర్తులందు గుణసంపన్నుండు...' అను పద్యములోను, 'అరయన్ బంగరుచాయవాడు...' అను పద్యములోను స్తుతించియున్నాడు. ఈ బ్రహ్మవేత్త జన్మచే అన్నె వంశము అధిక తేజోవిరాజిత మైనది. పద్మనాభుడు గ్రామాధికారియై శైవ పాదార్చనోత్సాహియై నుతికెక్కెను.

అంబారాయునికి (1) చలమయ్య, (2) రామయ్య, (3) మూర్తన్న, (4) గోపాలుడు అని నల్వురు కుమారులు. వీరిలో మూర్తన్న శ్రీ భోగమల్లేశ్వరాలయములో తన పూర్వుల యఖండదైవభక్తి మార్గము నుజ్జీవింప జేయుచున్నాడో యన, వీరభద్రస్వామిని ప్రతిష్టజేసి స్వామి వారికి ప్రత్యేకముగా నిత్య నైవేద్య ధూపదీపారాధనల నిమి

త్తము భూమిని వ్రాసియిచ్చినాడు. ఇదియేకదా జన్మసాఫల్యము! వీరన్నకు ముగ్గురుకుమారులు (1) చలమయ్య (2) రామయ్య (3) రామలింగం. వీరిలో రామలింగం విద్వాంసుడై కవియై తండ్రికితగినపుత్రుడై యనేకచాటుధారలచే రసికలోకమున కానందము దోసిళ్ళబోసినాడు. రామయ్యపుత్రుడు చినదేవయ్య వేదాంతియై సాధువృత్తిజీవించినాడు.

శ్రీశైలమునకు పెదదేవయ్య తనూజుడై జ్యోతిశ్శాస్త్రమున నిష్కృష్టమగు సామర్థ్యమును సంపాదించి విద్వత్కుటుంబ ప్రథకు మెఱుగు బెట్టినాడు.

పద్మనాభునికుమారుడు వెంకయ్య. ఈయనయే యీ గ్రంథకర్త. ఈయన ప్రశస్తి పైన యుదాహృతమైనదికదా! ఈయనకు (1) గంగయ్య (2) బసవయ్య (3) లింగయ్య అను మువ్వురుసుతు లుద్భవించిరి.

అందుగంగయ్యకు (1) కోటయ్య (2) పద్మనాభుడు జనించిరి. వీరిలో పద్మనాభుడు ఈ గ్రంథప్రకాశుడు. తరతరములనుండి యనుశ్రుతముగా వచ్చుచున్న దైవభక్తి, విద్యాసక్తి, అధికార నిర్వహణ నైపుణ్యము, సాధుశీలము వీరి యందు ప్రత్యక్షమగుచు కీర్తినొసంగుచున్నవి వీరు తమ పూర్వులయందుగల భక్తివిశ్వాసములచే సమగ్రమగు తమ వంశవృక్షమును తయారుచేసి యీమృత్యుంజయ శతకమును ముద్రింపించి శ్రీ వెంకయ్యకవికీర్తిచంద్రికల సమస్త దిక్సీమల సంవ్యాప్తము చేయుటకు సంకల్పించి వంశీయ సోదరులతో సంప్రదించి వారి సాయముగొని యీ స్తవనీయోద్యమభారము వహించి జయప్రదముగ నిర్వహించినందుకు జగత్పితయగు నా భోగమల్లేశ్వరస్వామి వీరికిని, వీరికి చేదోడు వాదోడుగనున్న శ్రీ అన్నెవంశీయులందఱికిని ఆయురారోగ్యైశ్వర్య సౌఖ్యముల ప్రసాదించి పుత్రపౌత్రాభివృద్ధి కలుగజేసి యాచంద్రసూర్యతారకము శ్రీ అన్నె వంశమును పెంపొందించి కన్నాకై రక్షించుగాక!

ఇట్లు,

అక్కపెద్ది సత్యనారాయణ,

కాయపురం. గన్నవరం తా. కృష్ణాజిల్లా.

# మృత్యుంజయశతకము

శా. శ్రీగౌరీహృదయాబ్జబంభర! శివా! ♦ శీతాంశురేఖావతం
సా! గోరాజతురంగ! భూతియుతభా♦స్వద్దేహ! కైలాసశై
లాగారా! సుగుణాలవాల! మధురా♦లాపా! కృపాపాంగ! స
ద్యోగానందమయ ప్రశస్త! విశదో♦ద్యోగేశ! మృత్యుంజయా.

మ. గరిమన్ పండితకోటి కంజలుల సం♦కల్పించి కావించి మ
ద్గురువీరాఖ్యపదంబు వెన్ని సుకవీ♦ట్కోటిన్ నుతిన్ దన్ని ఈ
శ్వరకారుణ్యము గోరి పద్యశతభా♦స్వత్సత్కృతిన్ గూర్తు భా
స్కరతారంబుగ నిల్పి కూర్పఁదగు మో♦క్షప్రాప్తి మృత్యుంజయా.

మ. వరకర్ణాటమరాటలాటముఖష♦ప్పన్నైక దేశాంతర
స్థిరభాషాకృతకావ్యరత్నములమూ♦ర్తీభావమున్ గన్నత్వ
ద్గురుగాథాతతులాంధ్రపద్యములఁ♦గూర్తున్ సత్కృతిన్ భక్తిభా
స్కరతారంబుగ నిల్పి పోవఁదగు మో♦క్షప్రాప్తి మృత్యుంజయా.

మ. నతమౌనీంద్రసమూహ! భక్తఫలదా! ♦ నాగేంద్రభూషా! సము
న్నతవిజ్ఞాపన చేసెదన్ కరుణతో ♦ నాలించి రక్షింపవే
మతిహీనుండ రచింపఁబూనినమదే♦భవ్యాఘ్రవృత్తాళిసం
గతమౌ నీశతకంబు మారమణిగాఁ♦గైకొమ్ము మృత్యుంజయా.

మ. పరమామోదకవిత్వతత్త్వవిలస♦త్ప్రాశస్త్యమా లేదు శం
కరకారుణ్యకథానువర్ణనము సం♦కల్పించు టెంతేనియున్
పరికింపన్ నగుబాటు గాక గుణసం♦పన్నంబు కానేర్చునే
వరభక్త్యాత్మకమైనపల్కులకు లో♦పంబేమి? మృత్యుంజయా.

మ. అరయన్ బంగరుచాయవాఁడు సుకుమా♦రాకారుఁడద్వంద్వుఁడీ
శ్వరసేవానిరతుండు వీరయ కృపా♦సాంద్రుండు సామాన్యుఁడే
యురునిష్ఠాపరతంత్రతన్ నిరశనో♦ద్యోగవ్రతోపేతుఁడై
పరఁగెన్ మద్గురుఁడై నుతింతు నతనిన్ ♦ భవ్యాత్మ! మృత్యుంజయా.

శా. మాపూర్వుల్ చిరకీర్తు లందు గుణసం♦పన్నుండు తా బ్రహ్మవి
ద్యాపారంగతుఁ డన్నెవీరయ మహా♦ధన్యుండు తత్సత్కృపన్
నీపాదంబులభక్తి మాకు కలిగెన్ ♦ దేవాదిదేవా! శివా!
పాపధ్వాంతపతంగ! దివ్యశరద♦భ్రాభాంగ! మృత్యుంజయా.

మ. నగరాట్పుత్రిక నిన్ను మానసములో♦నన్ నిల్పి విశ్వాత్మకా!
జగదుద్దామఫలప్రదాయక! సురే♦శా! యంచు భక్తిన్ నుతిం
పఁగఁ గారుణ్యముమై గ్రహించి యనుకం♦పన్ పార్వతీకాంతకున్
నగబాల్ కాయ మొసంగి ప్రోచితికదా!♦ సర్వాత్మ మృత్యుంజయా.

శా. ఓకారుణ్యసముద్ర! యోపరబలర♦క్షోదగ్రగర్వాంతకా!
ఓకంజాతభవామరార్చితపదా! ♦ యోపార్వతీవల్లభా!
ఓకందర్పవినాశ! యోప్రథితమా♦యోద్యోగవిశ్వంభరా!
నీకంటెన్ మఱి యన్యదైవములఁ జ♦న్నే! కొల్వ మృత్యుంజయా.

మ. తలమే నీమహిమావిశేషముల సం♦దర్భంబు నూహింప నా
జలజాక్షుండును పద్మయోనియు సహ♦స్రాక్షుండు బృందారకుల్
తలపన్ శక్తివిహీను లన్ననుడి స♦త్యం బెన్న మత్పాపముల్
తొలగంద్రోచియుఁ బ్రోవరాఁగదె కృపా♦ఖ్యా! దేవ! మృత్యుంజయా.

మ. భవరోగంబున కౌషధం బమరసం♦భావ్యంబు పాపాటవీ
దవదాహం బఖిలార్థసిద్ధికని ప్రా♦ధాన్యంబు మోహార్ణవం
బవలీలంగను దాట నావ పరమా♦త్మన్ జేరుసన్మార్గమా
భవ! నీనామము తన్మహత్త్వము వచిం♦పన్ రాదు మృత్యుంజయా.

మ. పరమామేయభవన్మహామహిమ సం♦భావింప వేదంబులున్
పరమార్థం బిదమిత్థమం చని వచిం♦పన్ శక్తి లేకుండ ని
ష్ఠురమాయాపరికల్పితామరతతుల్ ♦ సూచింపఁగా శక్తులే
గిరిజాచిత్తపయోజబంభర మహో♦త్కృష్టాత్మ మృత్యుంజయా.

మ. తురగంబుల్ ద్విరదంబులున్ సుభటసం♦దోహంబులున్ సౌధముల్
పురముల్ రత్నవిభూషలున్ సకలసం♦పూర్ణోపభోగంబులున్
వరమాణిక్యము లస్థిరంబు లగు స♦ర్వంబున్ భవత్పాదపం
కరుహద్వంద్వసమాశ్రయంబు స్థిరమై ♦ కన్పట్టు మృత్యుంజయా.

మ. జగముల్ తద్గతజంతుజాలములు వి◆శ్వస్తుత్య! సృష్టించి పెం
పగ రక్షింపగ క్షుత్పిపాసల నడం◆పన్ బూని చెల్వొంది విం
తగ నొప్పారుచు సర్వభూతహృదయాం◆తర్యామివై యొప్పు నీ
దగు తేజంబున కేను మ్రొక్కెద ననం◆తా! దేవ మృత్యుంజయా.

మ. ఒకమారైనను భక్తి మానవుఁడు ని◆న్నో సాంబ! ధ్యానించి కొం
చక పూజించినయంతమాత్రన పున◆ర్జన్మంబు లే దండ్రు పా
యక యెల్లప్పుడు చేతులార నెస మి◆మ్మర్చించుధన్యుండు ఘూ
ర్ణకృపాప్తిం దగ ముక్తుఁడౌటరుదె? సాం◆బా! దేవ మృత్యుంజయా.

మ. కడు ఘోరం బగు కాననాంతముల దుః◆ఖం బందగా నేల ని
ష్ఠడమిం గల్గిన తీర్థయాత్రలకునై ◆బో నేల? యో సాంబ! నీ
యడుగుల్ నమ్మినభక్తసంతతికి ని◆త్యంబైన కైలాసస
త్ఫలసంప్రాప్తి కరస్థమై తనర చం◆ద్రచూడ! మృత్యుంజయా.

మ. కలుషాత్ముండగు దుష్టబుద్ధి పలువం◆కల్ పోవుఁగా కెన్ని బో
ధలు కావించిన చక్కనై సరళమై ◆ త్వద్గోష్ఠి వర్తింపగా
గలదే మక్కువ? కుక్కతోఁక పలువం◆కల్ పోవఁగాఁ దీర్చి బ్ర
ద్దలతోఁ గట్టిన నిల్వ నేర్చునె ప్రశ◆స్తా! సాంబ! మృత్యుంజయా.

మ. కలధౌతాచలశృంగకూటగతశృం◆గారైకపీఠంబుపైఁ
గలకాలంబు సుఖప్రశస్తత జగ◆త్కల్యాణముల్ కూర్చు ని
శ్చలు భావించి నమస్కరింతు మది పూ◆జల్ చేయుదున్ భక్తిఁ బా
పలతాజాలలవిత్ర! ప్రోవఁదగు స◆ర్వవ్యాప్త! మృత్యుంజయా.

శా. నీకారుణ్యసమావలోకనము నెం◆తేఁ గంటి ధన్యాత్మ! సు
శ్లోకాప్తా భవదంఘ్రిపంకరుహ తే◆జోవాప్తి చేకూరె నా
నీకున్ మ్రొక్కెద దీనరక్షక! భవా◆నీచిత్తనాళీక! కే
ళీకైలాసనివాస! తాండవసుఖ◆శ్రీలోల! మృత్యుంజయా.

మ. లలితప్రస్ఫుటభావసంతతి నన◆ల్పప్రజ్ఞతన్ కూర్చి ప
ల్కులఁ దేనెల్ చిలుకంగ మేల్ రచన నా◆కున్ కూర్చి యాపైనిని
ర్మలసారళ్యరసప్రసారసుగుణ◆ప్రాశస్త్యమున్ కూర్చి నా
తలఁపుల్ ధన్యమొనర్పవే దివిజవం◆ద్యా! దేవ! మృత్యుంజయా.

మ. గతజన్మంబులయందుఁ జేసిన యస♦త్కార్యైకబాహుళ్యసం
చితకర్మాంబుధిలో మునింగియు పరిం♦జేరంగలేకుండి నేఁ
డతిపుణ్యంబున మీపదాబ్జములు డా♦యన్ గంటి మత్పాపసం
తతులన్ ద్రోచియు మోక్షమీయఁదగుని♦త్యానందమృత్యుంజయా.

మ. తలయం దెప్పుడు గంగ భోరుమని మ్రో♦తల్ వెట్ట దేహంబునం
దలికాకోదరసంఘ మెంతయును ఫూ♦త్కారంబులన్ జేయ సం
కులనాదార్భటిలోన విన్బడ కడం♦గున్ బోలుఁ గాకున్న నా
పలుకుల్ నీమది నీఱుచేయువాకో! స♦ర్వస్తుత్యా! మృత్యుంజయా.

శా. నీతో బాంధవముల్ బొనర్చుటకు నెం♦తే శైలవర్యుండనే ?
నీతోఁ జెల్మినిఁ జేసి మించుటకు పూ♦న్కిన్ కిన్నరేంద్రుండనే?
నాతాత్పర్యము కాదుకాదిది మహా♦నందప్రదు న్నిన్ను నా
చేతోవీథిని నిల్పికొల్చెదను నన్♦ జేపట్టు మృత్యుంజయా.

మ. నిను జింతించెదఁ బూజఁజేసెద భవా♦నీనాథ! నిన్నెంచి భ
క్తిని సాష్టాంగముగాఁగ మ్రొక్కెదను ము♦క్తిన్ గోరి రక్షింపవే
యనఘా! ఘోరతరాఘసంహరణ! ప్ర♦త్యక్షంబునన్ బ్రోవవే
వినుతాభీష్టఫలప్రదాయక! ప్రభూ! ♦ విశ్వాత్మ! మృత్యుంజయా.

శా. స్వామీ! తావకపాదపద్మములకున్ ♦ సాష్టాంగముల్ సేతు సు
త్రామాద్యర్చిత! దీనపోషక! యనం♦తా! లోకసంరక్షకా!
సోమా! సోమకలాపబంధురజటా♦జూటాభిరామా! పరం
ధామా! పాపవిరామ! భీమ! త్రిజగ♦ద్ధారేయ! మృత్యుంజయా.

మ. రజతాద్రీశ్వర! మేరుచాప! త్రిజగ♦ద్రక్షా! విరూపాక్ష! నీ
రజతాద్రిన్ సగపాలొసంగుమని యా♦రాధింప హేమాద్రిలో
నిజమొక్కించుక వేడ వేడెదను పో ♦ నిర్గన్ భవత్పాదపం
కజభక్తిన్ దయచేయవే యనుచు లో♦కస్తుత్య! మృత్యుంజయా.

శా. శ్రీశైలాదిమహాస్థలంబుల భువిన్ ♦ సేవింపఁగానేర గౌ
రీశా! త్వత్పదకంజయుగ్మమును న♦ర్థిన్ బూజగావింతు భూ
తేశాద్యంచితభవ్యనామముల నెం♦తే భక్తి ధ్యానింతు వా
ణీశప్రస్తుతనామధేయ! సుమనో♦హృద్గేయ! మృత్యుంజయా.

శా. ధ్యానింతున్ భవదీయరూపమును చి♦త్తంబందు మన్నించి ని
త్యానందమ్ము ఘటింపవే! విపులమా♦యాపాశముల్ ద్రెంపవే
నానారీతుల నీతలం పదికదా! ♦ నందీశ! నన్ బ్రోవవే
జ్ఞానానందమయస్వరూప! నిఖిలే♦శా! సాంబ! మృత్యుంజయా.

మ. సరసాలాపములన్ వినోదకథలన్ ♦ సంతోషసల్లాపభా
స్వరలీలాదుల పార్వతీయుతుఁడవై ♦ వర్తింపుచున్ భక్తులన్
పరిరక్షింపుచునుండు దేవ! నను కా♦పాడంగ రావే! మహే
శ్వర! కైలాసనగాధివాస! యవతం♦సాత్రేయ మృత్యుంజయా.

మ. శరణం బంచును సారెకున్ బలుక నో♦చంద్రార్ధకోటీర! నా
మొర నాలింప వదేమి? నైజవిధమా? ♦ భూతేశ నాభాగ్యమా?
శరణార్థిన్ నను బ్రోవవే బిరుదులన్ ♦ సార్థంబులన్ జేయవే
కరుణింపన్ దలపోయవే భుజగరా♦డ్గ్రైవేయ! మృత్యుంజయా.

మ. తలపన్ లీలకు తోలుబొమ్మలవలెన్ ♦ దాఁ జేయుచందంబునన్
మలభూయిష్ఠపుతోలుబొమ్మలను నీ♦మాయాజగంబందునన్
తెలివిన్ ప్రాణముబెట్టి చేసితివి బుద్ధిన్ మీఁరె నీమాయ న
న్నెలమిన్ బ్రోవుము దీనరక్షక! దయా♦బ్ధీ! సాంబ! మృత్యుంజయా.

మ. జిలుగుంబుట్టము గట్టి హేమమయమం♦జీరాదిభూషావళుల్
నలువొప్పన్ ధరియించి సౌరభలస♦న్మందారసూనావళిన్
తలపైఁ దాల్చి గిరీంద్రకన్య చెలువొం♦దన్ వామభాగంబునం
దలరారంగలనిన్ను గంటి గుణగ♦ణ్యా! సాంబ! మృత్యుంజయా.

మ. రజతక్ష్మాధరమో యనం బొలుచు గో♦రాడ్వాహనం బెక్కి యం
బుజగర్భాదులు గొల్వ నీకడకు స♦మ్మోదంబుతో రాఁగ నీ
నిజరూపంబును గాంచి సంభ్రమభయా♦న్వీతుండనై పాదపం
కజయుగ్మంబు సమాశ్రయించితిని లో♦కస్తుత్య! మృత్యుంజయా.

మ. మును జన్మాంతరపుణ్యలేశమున మి♦మ్మున్ నాదుడెందంబునన్
గనుగొంటిన్ కడగంట నెల్లసిరులన్♦ గంటిన్ కృపావీక్షణం
బునఁ జేకూర్చుట చిత్రమే శుభములన్ ♦ పుంఖానుపుంఖంబుగా
సనకాదిస్తుత! యుప్పలూరుపురవా♦సా! సాంబ! మృత్యుంజయా.

శా. స్వామీ! నేరము లెంచఁబోకు ఘనసం♦సారాబ్ధిలో ముంచఁబో
కేమో నంచుఁ దలంపఁబోకు మిహలో♦కేచ్ఛన్ మహాదేవ! నే
నామోదింపను సర్వకాలముల స♦ర్వావస్థలన్ త్వత్కథా
స్తోమం బొక్కటి దక్క నర్తనవిశే♦షోల్లాస! మృత్యుంజయా.

మ. భళిరా! శంకర! యెన్నిచందముల నిన్♦బ్రార్థించినన్ బల్క వి
ల్లెలమిన్ వీడియు భక్తులన్ గనవహా♦ వెయ్యారు లిమ్మంటినా
బలవంతుండ నటంచు బాకి దొరగన్♦భావ్యంబె? బ్రహ్మాస్త్రమున్
దలపన్ బిచ్చుకమీద వేయఁగను వి♦ద్యాదక్ష! మృత్యుంజయా.

మ. కలుషంబుల్ చెదరెన్ శుభంబు లొదవెన్♦ గష్టాళి చల్లారెనే
నెలమిన్ ధన్యుఁడనైతి తథ్యముగ నా♦కెందైన సందేహముల్
కలవే? తావకసుస్వరూప మెదలోఁ♦ గన్పట్టుటన్ జేసి యో
లలితాంభోధినిషంగ! రమ్యతరలీ♦లాలోల! మృత్యుంజయా.

మ. అరయన్ విశ్వసమస్తజీవతతిప్రా♦ణాధార మీవే కదా!
నరు లీసత్యము విస్మరించి మహదా♦నందంబునన్ గర్వులై
వరదా! యీశ్వర! సర్పభూషణ సుభా♦వా! యంచు నీనామమున్
స్మరియింపంగఁదలంప రెంతయుఁగృత♦ఘ్నప్రాప్తి; మృత్యుంజయా.

మ. తలపన్ నీమహిమాంతముల్ తెలియఁగా♦ దక్షత్వ మెవ్వారికిన్
గలదే? తొల్లి పితామహుండుశిరమున్♦ కంజాక్షుఁడంఘ్రుల్ గనన్
వలతుల్ గారట యిట్టిచోట పరులన్♦ వాక్రువ్వఁగా నేల? స
ల్లలితార్ధేందుకలాప! చారుతరలీ♦లాలోల! మృత్యుంజయా.

మ. ధరణిన్ తావకభక్తసంఘమున ప్రా♦ధాన్యుం డగస్త్యుండు తా
వరబ్రహ్మర్షి పయోధి గ్రోలె దనుజున్♦ వాతాపి భక్షించె ని
ర్జరలోకేశ్వరుఁడైన యానహుషుదు♦ర్గర్వంబు మాయించె దే
వరసద్భక్తుల కెవ్వ రీడు పుడమిన్♦ బాటింప మృత్యుంజయా.

శా. నానాజన్మము లెత్తియెత్తియుఁ గడున్♦ నాప్రాణముల్ రోసి యెం
తే నీపాదము లాశ్రయించి నినుఁ బ్రా♦ర్థింతున్ సదా భక్తితో
నీనామావళిఁ గూర్చి పద్యములుగా♦ నిర్మించి నీరూపముల్
గానన్ గాఁ దలఁపూనినాడ గుణగ♦ణ్యా! బ్రోవు మృత్యుంజయా.

మ. అవలీలన్ గిరు లెత్తవచ్చు శరధుల్ ♦ హస్తంబులన్ దాటి తో
నవలన్ బోవఁగవచ్చుఁ దారకలసం♦ఖ్యన్ దెల్పఁగావచ్చు తా
లవముల్ లెక్కకుఁ జెప్పవచ్చు సుగుణా♦లంకార! నీసత్కథా
శ్రవణంబందు మనంబు నిల్ప వశమే? ♦ సర్వేశ! మృత్యుంజయా.

మ. అనఘా! మానవుఁ డెవ్వఁడేని నిను చి♦త్తాబ్జంబునం దెంచినం
తనె దోషంబు లడంగి పుణ్యతనుఁడౌ♦తథ్యం బయఃఖండ మిం
పౌనరన్ హేమము గాకయున్నె పరుసం♦బున్ సోకినట్లైన నో
సనకాదిస్తుత! యుప్పలూరిపురవా♦సా! సాంబ! మృత్యుంజయా.

మ. ఒకనాఁడేనియు మానవుండు మదిలో♦నూహించి యెంతేని తా
వకపాదాబ్జయుగంబు భక్తిమెయి వి♦శ్వస్తుత్య! ధ్యానించి య
త్యకలంకస్థితిఁ బూజసేయ జననా♦యాసంబు విచ్ఛేదమై
సుకముల్ గల్గెడు తావకీనమహిమల్ ♦ చోద్యంబు మృత్యుంజయా.

మ. శ్రుతులన్ శాస్త్రములన్ పురాణచయముల్ ♦ సాంపొందగా నేర్చినన్
క్రతువుల్ సువ్రతముల్ దపంబులు భువిం♦గావించినన్ ముక్తి లే
దతిభక్తిన్ మిము బూజసేయక మహా♦త్మా! భక్తకల్పద్రుమా
నతయోగీంద్ర! సురేంద్రపూజిత! మహా♦నందాత్మ! మృత్యుంజయా.

మ. ఒకనాఁడేనియు మానవుండు మదిలో ♦ నోసాంబ! యన్నంత నం
దుకదా! విశ్వవిహార! జ్ఞానమయ! యెం♦తో భక్తి నర్చించుచున్
సకలాత్మస్థితిఁ బూజసేసిన పున♦ర్జన్మంబు లేదంచుఁ దా
వకపాదాబ్జము లాశ్రయించితిని బ్రో♦వన్ రాదె మృత్యుంజయా.

మ. జగతిన్ పుత్రకళత్రభ్రాతృజనసం♦సారంబునన్ జిక్కి రే
బగళుల్ పంచజనుండు గ్రాసమును సం♦పాదింప దుష్కార్యముల్
మిగులం జేయుచు కాలకర్మగతి నో♦లిన్ బుట్టుచున్ చచ్చుచున్
వగ యుష్మద్భజనం బొనర్పఁదలఁపూ♦నన్ బోఁడు మృత్యుంజయా.

మ. ధరణిన్ క్రోత్రితులకేల బన్నసరముల్ ♦ దర్కింపగాఁ జీకుకో
క్కెరకున్ పంజరమేల? పెద్దపులికిన్ ♦ గీతాప్తి తా నేల? ను
ర్వరలోకైకశరణ్యా! దుర్జనుల కే♦ప్పాటన్ భవత్పాదపం
కరుహారాధనమేల? శోభనకటా♦క్షాలీల! మృత్యుంజయా.

మ. జనముల్ గాదన లోభివానిధనముల్ ♦ సత్కారశూన్యంబులై
జనుఁ దా నెత్తినజన్మసంతతులు సం♦సారంబులున్ మిథ్యలే
కనదాశీవిషభూషణా! ప్రకటవి♦ఖ్యాతార్ధనారీశ్వరా!
ఇనచంద్రాగ్నివిలోచనా! సకలలో♦కేశా! సాంబ! మృత్యుంజయా.

మ. సకలైశ్వర్యము లుండియుం దినదు లే♦శంబైనఁ దా లోభి యే
నికిఁ దాఁ బెట్టడు ద్రవ్యవాంఛఁ బ్రజలన్ ♦ బీడించు నాదుర్గుణం
బకటా! వేగ నశింపకున్న యెడ మో♦క్షానంద మెట్లబ్బు సే
వకరక్షాపరతంత్ర! సర్వసుమనో♦వాగ్గేయ! మృత్యుంజయా.

మ. హర! మాయాసతితో నరుం డెపుడు క్రీ♦డారంభుఁడై యెందునన్
పరమానందమునంది మైమఱచి దు♦ర్వ్యాపారపారీణుఁడై
నిరతంబున్ చరియించుఁగాని నిను ధ్యా♦నింపన్ మనంబందు సో
మరియై భక్తి వహింపఁడింతయు మహా♦త్మా! సాంబ! మృత్యుంజయా.

మ. తనువుల్ బంధులు భూరిసంపద లని♦త్యంబుల్ మహాభోగసా
ధనముల్ గేహము లాప్తమిత్రులును కాం♦తాపుత్రపౌత్రాదులున్
తనవెంటన్ బడి రారు ధర్మ మొకటే♦ తథ్యంబుగాఁ దోడుగా
వున సత్కర్మము లాచరింతురు ఘనుల్ ♦ పుణ్యాత్మ మృత్యుంజయా.

మ. వనజాతాయతనేత్రుఁడిచ్చు వరముల్ ♦ వమ్మైన వారాసు లిం
కిన శైలంబులు దిర్దిరన్ తిరిగినన్ ♦ గీనాశుదండంబునన్
ఘనసౌమ్యస్థితి గల్గినన్ ప్రళయదు♦ష్కాలాప్తి యెందైన స
జ్జనసత్యవ్రత మన్యథా యగునె? వి♦శ్వస్తుత్య! మృత్యుంజయా.

మ. శతసంవత్సరకాల మాయు వగు నెం♦చన్ భూమిపై మానవ
స్థితి యట్లయ్యును దేహిసంతతులు వి♦చ్ఛిత్తైను విద్యుల్లతా
తతినిన్ బోలి మహాత్ము లిందుఁగలస♦త్యం బెంచి యిష్టాప్తి స
ద్గతికిన్ త్వత్పదపద్మముల్ నిలుపు చి♦త్తంబందు మృత్యుంజయా.

మ. తరుణోపాయ మొకప్పుడైన మదిలో ♦ తర్కింపగా మాయకాఁ
పురముల్ నిత్యములంచు నమ్మి దివసం♦బుల్ బుచ్చువాఁ డిద్ధరన్
నరుఁడై పుట్టిననేమి? కాననములో ♦ నక్కాడగాఁజాలువా
నరుఁడై పుట్టిననేమి? జ్ఞానమయ! ధ♦న్యంమన్య మృత్యుంజయా.

శా. చేయంగూడదు మూఢమానవగణా♦స్నేహంబు మోహంబుతోఁ
డాయంగూడదు దుష్టసంఘముల సం♦దర్శంబు విజ్ఞానినై
పాయంగూడదు త్వత్పదాబ్జయుగళీ♦భక్తిప్రచారంబు నీ
శా! యజ్ఞాత్మక! మేరుచాప! భవ! వి♦శ్వస్తుత్య మృత్యుంజయా.

మ. కరుణన్ గాచుట ధర్మమే గనుక నన్♦గావంగ ధర్మంబు యో
వరకైలాసనివాస! భాస్వర! శివా! ♦ భవ్యాత్మ! లోకేశ్వరా!
కరుణాబ్ధీ! భవబంధమోచన! మహా♦కాళీమనోరంజనా!
పురుహూతామరలోకవందితపదాం♦భోజాత! మృత్యుంజయా.

శా. చౌటన్ జల్లినబీజముల్ మొలచునే ♦ సర్వంసహామండలిన్?
బాటింపంగ ముసిండి చేదువిడునే ♦ పాల్పోయుచున్ బెంచినన్?
నూటిన్ మూర్ఖున కెన్ని దెల్పినను సం♦శుద్ధాత్ముఁడై మించునే
కోటీరేందుకళావిలాస! పరర♦క్షోనాశ! మృత్యుంజయా.

మ. హరు సేవింపనివానికిన్ గలుగఁబో♦దైశ్వర్యసంప్రాప్తి స
ద్గురుబోధన్ గనఁబోనివాని కగునే ♦ గూఢార్థలాభంబు శం
కరు నర్చింపనివాని కేగతిని మో♦క్షప్రాప్తి చేకూరెడున్
హర! కైలాసనగాధివాస! గుణగ♦ణ్యానంద! మృత్యుంజయా.

శా. కేలన్ మాలిక నూని చంక నొకతోల్ ♦ గీలించి యున్మీలురై
యాలోనన్ బెదవుల్ గదల్చుచు బక♦ధ్యానంబు గావించు చీ
భూలోకంబున దంభభక్తులు ప్రజన్ ♦ బొక్కించుచున్నారు దు
శ్శీలుర్ వారలఁ జక్కఁజేయవె? సుభా♦షీ! సాంబ! మృత్యుంజయా.

శా. కామక్రోధములన్ జయించి గతరా♦గద్వేషులై శేముషీ
సామర్థ్యంబున మించి యింద్రియజయ♦స్వాతంత్ర్యమున్ బూని ని
ష్కామత్వంబున నొప్పుభక్తులకు మో♦క్షప్రాప్తి కాకుండునే?
స్వామీ! దీనదయాపరా! యుపనిష♦త్సంవేద్య! మృత్యుంజయా.

శా. ఎన్నండో దయ నన్నుఁ జూచి రజతా♦ద్రీశుండు శర్వాణితో
మన్నింపందగువాఁ డితం డనుచు స♦న్మానించి రక్షించి తా
మున్నెన్నండు వినంగఁబోనివిషయం♦బుల్ దెల్పు టెప్డో కదా
అన్నా! దీనదయాపరా! సుగుణవం♦ద్యా! సాంబ! మృత్యుంజయా.

మ. గతజన్మంబుల నీవిలాసమహిమల్ ♦ కైవారముల్ జేసి సం
గతదోషంబు లడంచి పాపముల నిం♦కన్ జేసితిన్ దాన స
మ్మతి కైలాసమహాపదాప్తి యొదవన్♦ రాదయ్యెఁ గారుణ్యవి
స్తృతసద్వీక్షణపాళిఁ బ్రోవఁగదె తం♦డ్రీ! సాంబ! మృత్యుంజయా.

మ. గణనాతీతభవంబులన్ గని నినున్♦ గానంగలేనైతి స
ద్గుణసంపూర్ణ! దయాస్వరూపుఁడు మహా♦త్ముండంచు నిన్ వింటిఁ గా
రుణికత్వంబునఁ బాపసంగతు ననున్♦ బ్రోవంగ రా రమ్ము శ్రీ
ఫణిరాడ్భూషణ! పోషితాశ్రితజనా! ♦ భవ్యాత్మ! మృత్యుంజయా.

మ. కమలాధీశుమృదంగవాద్యము దివౌ♦కజ్యేష్ఠుతాళంబు నా
దమునన్ మించఁగ శారదాతరుణిగీ♦తంబుల్ చెలంగంగ న
య్యమరుల్ సిద్ధులుసంయమీంద్రులుఁగ♦ణాధ్యక్షుల్ భజింపన్ బ్రదో
షములన్ నాట్యముసల్పుమూర్తి మదినన్♦ స్థాపింతు మృత్యుంజయా.

మ. ఎసలే రెండును బ్రహ్మవేత్తకును నా♦హింపంగ భూమండలం
బున వేదంబులు శాస్త్రముల్ చదివినన్ ♦ భూపాలుఁడై రాజ్యపా
లనముల్ జేసినఁ గామినీ సరసస♦ల్లాపాళి వర్తించినన్
దనుజోద్దామవిరామ! యున్నమితభ♦క్తిస్థేమ! మృత్యుంజయా.

మ. ఫణిరాడ్హారము జూచి నే వెఱవ నీ♦పైకృత్తి వీక్షించి నే
తొణఁకన్ నీభయదాట్టహాసవికటో♦ద్యోగంబు చాలించి కా
రుణికత్వంబునఁ గాంచకున్నయెడ నా♦మోఘంబుగా నీదుల
క్షణముల్ దెల్పెద భక్తసంతతికి రా♦త్వాదీక్ష మృత్యుంజయా.

మ. ధనముల్ గల్గినచో సమర్థులకు స♦త్కారంబుగావించి స
జ్జనులన్ గూడి చరించి తావకపదా♦బ్జధ్యానపూజానుచిం
తనుఁడై పొద్దులుపుచ్చునాతఁడె మహా♦ధన్యుండు మాన్యుండు నా
ఘనతన్ బ్రస్తుతి సేతు నిద్ధర మహా♦కాళీశ! మృత్యుంజయా.

మ. ఒకశైలేంద్రము వాసభూమి విషము♦ద్యోగీంద్ర! కోదండ మొం
డొకశైలేంద్రము శైలరాజునకు నీ♦ వొప్పారు జామాత నా
ప్రకటస్వచ్ఛయశోవిశేషములు స♦ర్వం బెల్లెడన్ జాటుఁ దా
వక కాఠిన్యగుణంబు భూరికరుణా♦పారీణ! మృత్యుంజయా.

మ. అకటా! తావకపాదపద్మముల నే ♦ నశ్రాంతమున్ నమ్మి మా
మకచిత్తంబున నిల్పినందులకు సం ♦ భావింప వేమయ్య తా
వకనైజంబా? ప్రభుత్వలక్షణమొ? శ ♦ ర్వాణీశ! క్రీడాకిరా
తకవిఖ్యాతుఁడవౌట తద్గుణమొ? నిత్యానంద! మృత్యుంజయా.

మ. ధనముండా చెలికాఁడు మేరుగిరి కో♦దండంబు రౌప్యాద్రియా
ఘనసౌధంబు విభూతులన్ వెలయుభా♦గ్యమ్మాష్ట్రి జ్యోత్స్యందునీ
కొనరింపంగల దేది? దాస్యమొకటే ♦ యున్నోగ మార్యాప్రియా!
జనితోదార! గభీరభూరికరుణా♦సంకల్ప! మృత్యుంజయా.

మ. గతవర్షంబుల నెన్న నష్టశతమా ♦ కాపచ్చెఁ బోవచ్చె ను
ప్రితమై యింద్రియపాటవంబు చెడియెన్ ♦ సేవింప భావింప జీ
వితకాలం బది సంశయంబు తనువో ♦ విద్యుల్లతాదీప్తి స
మ్మతి త్వత్పాదము లాశ్రయించెదను ర♦మ్మా ప్రోవ మృత్యుంజయా.

మ. వనితాగారసువర్ణభూషణమణి♦వ్రాతంబులున్ వస్తువా
హనముల్ మంజుదుకూలముల్ సరసమృ♦ష్టాన్నాదభోజ్యంబు లె
వ్వనియింటన్ దులదూఁగు నాఘనుఁడు పూ♦ర్వప్రాభవంబందునన్
నిను బూజించినవాఁడు భూతలమునన్ ♦నిత్యాత్మ! మృత్యుంజయా.

మ. ఎలమిన్ గీటపతంగపన్నగములం♦దెన్నెన్ని జన్మంబులో
యిల వేదండవరాహసంఘములయం♦దెన్నెన్ని జన్మంబులో
తెలియన్ రాదు దురంతజన్మముల నె♦త్తింపంగఁబోకయ్య స
ల్లలితోదారగభీర! సాంబ! శివ! లీ♦లాలోల! మృత్యుంజయా.

శా. సూపం బింతయు లేనిభోజనము సం♦శోభింపఁగా నేర్చునే?
యూపస్థాపనలేనిసత్క్రతువు లే♦యుర్వీస్థలిన్ సాగునే?
నీపాదంబులభక్తి లేక తపముల్ ♦నిర్విఘ్నతన్ గాంచునే?
పాపారణ్యకుఠార! దివ్యతరచా♦పాహార్య! మృత్యుంజయా.

మ. దొర వంచున్ నెఱ నమ్మి నే మొఱలిడన్ ♦దోడ్పాటుగావించినన్
కరుణాదృష్టిని జూచి మోక్షపరమా♦నందంబు చేకూర్చి నీ
బిరుదుల్ నిల్పుకొనం గడంగు మిఁక రా♦వే బ్రోవవే! సన్నుతశం
కర! రౌప్యాచలవాస! భవ్యతరయో♦గాభ్యాస! మృత్యుంజయా.

మ. ఘనవిభ్రాజిత దేవగేహముఖ స♦త్కారంబులన్ జేయ ని
ర్ధనుఁడన్ వ్యర్థుఁడఁ బుణ్యతీర్థముల సం♦దర్శింప నానందకా
ననముఖ్యస్థలయాత్ర జేయుటకుఁ బూ♦నన్ శక్తిశూన్యుండ నే
నిను సేవించుటకంటె నొం డెఱుఁగనో♦ నిత్యాత్మ! మృత్యుంజయా.

మ. నినుబో ల్దాతల నెందుఁగానను భవా♦నీనాథ! నీచర్యలే
మన? ముప్పన్నె మెకంబుతోలు కటిసీ♦మన్ బూని భస్మానులే
పనమున్ జేయుచు భక్తకోటికి మదే♦భంబుల్ తురంగంబులున్
ధనధాన్యంబు లొసంగుచుందువట కా♦దా! సాంబ! మృత్యుంజయా.

మ. వరహాల్ తెమ్మని వేడ నెమ్మనములో♦ వాంఛింప జాత్యశ్వముల్
ద్విరదంబుల్ చతురంతయానపదముల్ ♦ దెమ్మంచు నే వేడ నీ
శ్వర! నీదర్శనమైనఁ జాలు పదివేల్ ♦ వందారుమందార! దు
ర్భరసంసారవిదూర! చారుసుకుమా♦రా! ధీర! మృత్యుంజయా.

మ. కరుణింపన్ దరియయ్యె దేవ! మునిము♦ఖ్య ప్రాప్తకైవల్య! యీ
శ్వర! నాపట్ల పరాకు సేయకు జగ♦ద్వంద్యా! మహాదేవ! భా
స్కరరాజానలనేత్ర! గోత్రనిలయా! ♦ కారుణ్యరత్నాలయా!
సురభక్తౌఘవిధేయ! దీనజనర♦క్షోపాయ! మృత్యుంజయా.

శా. యోగాభ్యాసవిశిష్టకాలము నిరు♦ద్యోగంబుగాఁ బోయె స
ద్యోగంబున్ బొనరింపనైతి వ్రతముల్♦దూరంబు లయ్యెన్ గటా!
త్యాగం బన్నదియే యెఱుంగఁ దరుణా♦ధారంబు నాకెట్టులో
భోగీ! భోగివిభూషణా! కరుణతోఁ ♦ బోషింపు మృత్యుంజయా.

మ. జగముల్ సృష్టి యొనర్చుచో నజుఁడవై ♦ సర్వంబు రక్షింపఁ బ
న్నగహారా! హరిమూర్తివై విలయమున్ ♦ గావింప శంభుండవై
త్రిగుణోపేతుఁడవై పరాత్పరుఁడవై ♦ శ్రీమించుచున్నట్టి నీ
సగుణాకారము నాత్మలోఁ దలఁచెదన్ ♦ సర్వేశ మృత్యుంజయా.

మ. సనకాదుల్ భజియింతు రెవ్వనిపదా♦బ్జంబుల్ మరెవ్వాని పా
వనచారిత్ర మనారతంబు సుజనుల్ ♦ వాంఛింతు రా దేవదే
వుని నిన్గొల్చెద నిష్టసిద్ధికిని సం♦పూర్ణైకచిత్తంబునన్
కనదుత్తుంగజటాకలాప! ఖలశి♦క్షాకోప! మృత్యుంజయా.

మ. మృదులంబైన దుకూలముల్ గలిగియున్ ♦ ముష్టాన్నతోల్పాత్రి! భా
స్వదలంకారసమూహముల్ గలిగిస ♦ ర్పంబుల్ మెడన్ దాల్త్రి! స
త్పదనంబుల్ మది కింపుగాఁ గలిగి ప్రే ♦ తస్థానమం దుందురే?
మదనాద్ధత్యవినాశ ! శుభ్రగిరిధా ♦ మా ! శ్రీను ! మృత్యుంజయా.

శా. నీవాఁడన్ గృపజూడు మంటి పరులన్ ♦ నేవేడఁ బోనంటి నా
యావజ్జనము నెన్నుచుంటి నితరం ♦ బాసింపఁ బోనంటి నో
దేవా! నీకది న్యాయమా వెతల నొం ♦ దింపంగ, రక్షింపవే
భావాతీత! కృపాసమేత! పరమ ♦ బ్రహ్మణ్య! మృత్యుంజయా.

మ. కరుణన్ జూచిన మంచిదే కృపకు వీ ♦ ల్గాదిష్టనన్ మంచిదే
పరులన్ వేడ ధ్రువంబు నేవిడువఁ బో ♦ వన్ త్వత్పదాబ్జంబు లో
వరకైలాసనివాస! మంజుతరవా ♦ గ్వైచిత్ర్యశోల్లాస! కుం
జరదైత్యాంతక! క్రూరదుష్టజనతా ♦ సంత్రాస! మృత్యుంజయా.

మ. ఒడలన్ బూడిదె దాల్చియున్ ఋషులసం ♦ యోగాప్తిచేమించి పెం
జడలన్ దాల్చి దిగంబరుండ వగుచున్ ♦ శైలంబుపైఁ జేరినన్
విడువన్ త్వత్పదయుగ్మముల్ కరుణ స ♦ స్వీక్షించి రక్షింపుమీ
విడు మీపంతము శంకరా! భవహరా! ♦ విశ్వాత్మ! మృత్యుంజయా.

మ. మిగులన్ గాటుకకొండఁబోల నగునె ♦ మ్మేనుల్ కరాళార్భటిన్
దగు వక్త్రంబులు బూని యంతకభటుల్ ♦ దర్పించి ప్రాణంబులన్
పెగులన్ దీతు రటంద్రు వారలకు నే ♦ భీతిల్లి నీసేవ రేల్
బగళుల్ చేయుచు నున్నవాఁడఁ గరుణా ♦ పారీణ! మృత్యుంజయా.

మ. వినమద్దాసజనావనా! కృప ననున్ ♦ వీక్షింపరా కాలయా
పనమున్ జేయక వాంఛితంబు లిడరా ♦ పంతంబు నీకేలరా?
సనకాదిప్రణుతా! మనోజహరణా! ♦ శార్దూలచర్మాంచితా!
ఘనకైలాసనిశాంత! భక్తజనసం ♦ ఘప్రాంత! మృత్యుంజయా.

మ. గతి నీవే యని యంటి సంతతము న ♦ న్గాపాడుమా యంటి నన్
వెతలన్ బెట్టకు మంటి జన్మవితతిన్ ♦ వేసారినా నంటి నీ
వతికాఠిన్యము బూనుచో నవలఁ గా ♦ వన్ దిక్కు లేదంటి సం
గతగోవిందవిలాసబాణ! వృషరా ♦ ట్కంబాణ! మృత్యుంజయా.

మ. తపమా నాస్తి యమంబు నాస్తితలపన్ ♦ దానంబు హీనంబు పై
జపమా శూన్యము, కట్టుకంబములు ని♦చ్చల్ కామమోహాదులన్
చపలాత్ముండ మహాపరాధిని పరే♦శా! సర్వలోకేశ! స
త్కృపమైఁ బ్రోవ ననుగ్రహింపఁదగు స్వా♦మీ! దేవ! మృత్యుంజయా.

శా. ఆలోకింపఁ జరాచరంబు లగు నీ♦యంభోజగర్భాండముల్
నీలోనన్ బ్రభవించుచుండు నడఁగున్ ♦ నీదివ్యచారిత్రముల్
నీలీలామహిమల్ నుతింపఁగలరే ♦ నీరేజగర్భాదులున్?
ప్రాలేయాచలకన్యకాకమల దీ♦వ్యద్దేహ! మృత్యుంజయా.

మ. దళమై ఫాలమునందు భూతిశకలుకొ♦న్నన్ జిన్నిజాబిల్లి వె
న్నెలనిగ్గుల్ వెదజల్లు శైలసుతతో♦నర్ధాంగపు రాగద్దియన్
కొలువై యున్న మహానుభావుని గనుఁ♦గొంటిన్ గడంగంటి ని
స్తులసమ్మోహనరూపవర్తననితాం♦తోద్దీప! మృత్యుంజయా.

మ. జగమే నమ్మిరి కొందరల్పమతులై ♦ సమ్మోహితుం గొందరీ
జగమున్ నమ్మఁగఁ బోక దేవుపదా♦బ్జంబుల్ తగన్ గొల్చిరీ
జగతిన్ నాస్తికదుర్మదాళికి మహా♦సాయుజ్యమే నాఁటికిన్
గగనంబే నిగమాంతవేద్య! సురము♦ఖ్యస్తోత్ర! మృత్యుంజయా.

మ. తనలో నుండెడివాని బ్రహ్మనుయుపన్ ♦ దర్శింపఁగా లేక భూ
జనముల్ బోదురు తీర్థయాత్రలకు శ్రీ♦శంభుండు కన్పించునే
ఘనవిజ్ఞానమయా! జనంబు వెలిగా ♦ గౌరీముఖాంభోజరం
జనఖద్యోత! కృశానురేత! దివిష♦త్సంత్రాత! మృత్యుంజయా.

మ. జయముల్ గల్గునె మానసంబునకు ని♦శ్శంకాత్ముఁడై యీషణ
త్రియముల్ జంపక మోహపాశతతులన్ ♦ దత్త్వజ్ఞుఁడై మానకే
నియతిన్ దావకసౌఖ్యముల్ తెలియకే♦నిష్కాముఁడై యుండినన్
నయసంపన్నజనావనా! సుగుణగ♦ణ్యా! సాంబ! మృత్యుంజయా.

మ. కులధర్మంబులు తప్పె మానవులకున్ ♦ గ్రోధంబుపైఁ గప్పె భూ
ములు నిస్సారత నొప్పె వానలు క్రమం♦బున్ దప్పె నిద్ధాత్రిపై
కలికాలంబు ప్రవర్ధమాన మగుచున్ ♦ గన్పట్టె దుర్లంఘ్యమై
కలుషారణ్యదవానలా! వినుతభ♦క్తత్రాత! మృత్యుంజయా.

మ. తలపైఁ గ్రొన్నెల నీరు వెన్నెలలుగా♦త్రింబందుఁగాఁ గోలమం
దలి పెంజీకటు లోకుల్ దెలుపు నా♦త్మజ్ఞానముల్ భూజనం
బులకున్ భోగము లెల్ల మిథ్యలని యు♦ద్బోధించుఁగా దైత్యని
ర్దళనారంభవిజృంభమాణ! నతభ♦క్తత్రాణ! మృత్యుంజయా.

మ. ఘనమౌ భక్తిని వేవిధంబులనుతుల్ ♦ గావించుచున్నన్ వినీ
వినకున్నావన దేమి న్యాయము గనే!♦ విశ్వాత్మ! చిన్మూర్తియా
నిను డెందంబునఁ గట్టివేసెదను బూ♦న్కిన్ మోక్ష మీకున్నచో
ఘనయోగీంద్రవిధేయ! శేషభుజగ♦గ్రైవేయ! మృత్యుంజయా.

మ. జయ గౌరీవర! పాపసంహర! సురే♦శా! విశ్వసంరక్షకా!
జయ సంసారవిదూర! భక్తవరదా ♦ శార్దూలచర్మాంబరా!
జయ నాగేంద్రవిభూష! దానవసపో♦షా! భుక్తిముక్తిప్రదా!
జయ వేదాంతవిహార! హంస్యపురుషా!♦సర్వేశ! మృత్యుంజయా.

మ. అమితంబైన భవాబ్ధిలో మునిఁగి నే♦నర్థింపఁగా లేక ని
ష్టములందున్ సతులందు బాంధవసుతా♦సంజాతులందున్ ముదం
బమరన్ జేయుచు యుష్మదీయపదప♦ద్మారాధనల్ జేయనో
విమలాత్మా! తలపోతు నిన్ను పునరా♦వేప్రిన, మృత్యుంజయా.

మ. భవపాశంబులఁ జిక్కి మోహమయసం♦బంధంబుచేఁ దక్కి నే
నవలన్ భక్తిగణంబు తెల్పఁగ నవి♦ద్యావ్యాప్తికామ్యార్థముల్
సవిశేషంబులు గావటంచు మది మో♦క్షప్రాప్తికిన్ త్వత్కథా
శ్రవణంబే గతియంచు నమ్మితిని వి♦శ్వస్తుత్య! మృత్యుంజయా.

మ. కనదుత్తుంగవిభాసమాన మగు నీ♦కైవల్యసింహాసనం
బున కశ్రాంతము మేలుకావలె దయాం♦భోధీ! యుమానాథ! మీ
ఘనభక్తావనతత్పరత్వమునకున్♦గల్యాణముల్ కావలెన్
వనజాతప్రభవాండకుంభ! నటనా♦వష్టంభ! మృత్యుంజయా.

శా. క్షోణీచక్రము తేరు పుల్లకమలా♦క్షుం డెన్నబాణంబు సత్
క్షోణీధ్రేంద్రము విల్లుగాఁ ద్రిపురర♦క్షోబాధమాయింప గీ
ర్వాణీశుండు నియంతగా నిగమముల్♦వాహ్యాంబులై మించ గీ
ర్వాణుల్ సన్నుతిజేయఁ గంటి విజయ♦ప్రఖ్యాతి మృత్యుంజయా.

మ. సిరికిఁ బట్టగు నాంధ్రదేశము శుభ♦శ్రీలంది భూదేవికిఁ
గర మొప్పం దగు రత్నకంకణము భా♦గ్యస్ఫూర్తి తద్దేశమం
దరయంగా బెజవాడసీమను బ్రసి♦ద్ధంబైన కృష్ణానదీ
వరతీరంబున నుప్పులూర నివసిం♦పం గంటి మృత్యుంజయా.

మ. జగతిఁ బ్రస్తుతిగన్న యన్నెకులసం♦జాతుండ వీతాఘుఁడన్
సుగుణోపేతుఁడు పద్మనాభయతనూ♦జుండన్ మనఃపూర్వకం
బుగఁ బద్యంబుల నేర్చి కూర్చి శతకం♦బున్ వేంకయాఖ్యుండు నో
జగదీశా! కృతి నిత్తుఁ జేకొనుము వి♦శ్వస్తుత్య! మృత్యుంజయా.

మ. సరిగాఁ జెప్పితి శాలివాహశకవ♦ర్షప్రాప్తవద్బాణకుం
జరగోత్రాంబుజవైరిసంఖ్యలను నెం♦చన్ దుందుభిప్రోక్తవ
త్సరమాఘంబునఁ బద్యరత్నశతకో♦ద్యత్సత్కృతిన్ గూర్చి యీ
శ్వర! త్వత్పాదములందు జేర్చితిని మో♦క్షప్రాప్తి మృత్యుంజయా.

మ. శతకంబన్న కృతిన్ రచించి గిరిజే♦శా! నీకు నర్పించి మ
త్కృతదోషంబుల నీగ నీదుపదముల్♦ గీర్తింతు మోక్షార్థినై
ధృతిఖర్వ్యుండు మహోన్నతద్రుమమునం♦ దింపారు మాధుర్యసం
గతపక్వామ్రఫలంబు గోరు ప్రియవాం♦ఛన్ దీర్పు మృత్యుంజయా.

Printed by I. V. Ratnam, M. SC., at the A. G. Press, Bezwada.